క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలోని నిడిగల్లులో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నిడిగల్లు గ్రామంలో మధ్యాహ్నం 2.00 గంటలకు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు అందరూ పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పేదలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్

గూడూరు: పట్టణంలోని బాలాజీనగర్‌లోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ అధ్యక్షుడు కే చంద్రశేఖర్ చేతుల మీదుగా ఆదివారం నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. యూకేలో ఎంఎస్ చదువుతున్న ఎస్ రామ్‌ప్రకాష్ జన్మదినం సందర్భంగా మహిళలకు చీరల పంపిణీతోపాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు బీ ధనుంజయరెడ్డి, కే శ్రీనివాసులు, జీ చంద్రశేఖర్, రమేష్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

29న సైదాపురంలో నేదురుమల్లి పర్యటన

సైదాపురం: మండల కేంద్రంలో ఈ నెల 29వ తేదీన వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని జేసీఎస్ కన్వీనర్ మన్నారపు రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ సంబరాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు స్కూటీ వేలం

వెంకటగిరి: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం ఆవరణలో సోమవారం ఉదయం 10.00 గంటలకు ఎక్సైజ్ చట్టం ప్రకారం సీజ్ చేసిన స్కూటీని బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పి నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

కోట: మండలంలో కోడి పందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. పోలీసుల కథనం మేరకు.. సిద్ధవరం సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారమందింది. దీనిపై స్పందించిన ఎస్‌ఐ తన సిబ్బందితో కలసి ఆ ప్రాంతంలో దాడులు చేశారు. పందెం ఆడుతున్న ముగ్గురు పందేల రాయుళ్లను అరెస్టు చేసి, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పుల్లారావు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పార్లమెంట్ సభ్యత్వం రద్దు సబబు కాదు

గూడూరు: కేంద్ర ప్రభుత్వం రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడం సబబు కాదని, ఆ నిర్ణయాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వెంకటగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పంటా శ్రీనివాసులరెడ్డి రెడ్డి అన్నారు. ఎంపీ సభ్యత్వ రద్దు చర్యను ఖండిస్తూ స్థానిక పాత బస్టాండ్ కూడలి ప్రాంతం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు.

విహంగం..వీక్షణం

- ఓ వైపు విద్యార్థుల సందడి... ఇంకోవైపు పక్షుల కిలకిలలు
- ఎండను సైతం లెక్కచేయని పక్షి ప్రేమికులు



కేంద్రంలో విడిది చేస్తున్న నత్తగుల్ల కొంగలు

దొరవారిసత్రం: వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసి విద్యార్థుల సందడి ఓవైపు... మరోవైపు పక్షుల కేరింతలతో ఆదివారం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం కోలాహలంగా మారింది. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ పక్షి ప్రేమికులు వేడిని సైతం లెక్క చేయకుండా పక్షులను వీక్షించారు. వలస విహంగాలను వీక్షించేందుకు మదనపల్లె, తిరుపతి, నెల్లూరు, శ్రీకాళహస్తి, చిత్తూరు తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు వెయ్యి మందికి పైగా బస్సుల్లో ఇక్కడకు వచ్చి పక్షులను వీక్షించారని స్థానిక వన్యప్రాణి విభాగం సిబ్బంది తెలిపారు. స్థానికంగా ప్రసిద్ధి చెందిన గూడబాతులు, తెల్ల కంకణాయిలు, తెడ్డు ముక్కు కొంగలు, నత్తగుళ్ల కొంగల పిల్లలు అన్నీ పెద్దవై ఎగిరే స్థాయికి చేరాయి. వీటి సీజన్ త్వరలోనే ముగియనుంది. సందర్శకుల కోసం మార్గం మధ్యలో అవసర మైన తాగునీటి వసతి ఏర్పాటు చేసేలా పక్షుల కేంద్రం రేంజర్ ఆఫీసర్ వరప్రసాద్ చర్యలు చేపట్టారు. బయట ప్రాంతాల నుంచి కేంద్రానికి విచ్చేసే పర్యాటకులకు విహంగాల జీవన శైలి, ప్రకృతిలో పక్షుల ప్రాధాన్యత వంటి అంశాల గురించి స్థానిక సిబ్బంది వివరించారు. చెరువు కట్టపై ఉన్న వ్యూ పాయింట్లు వద్ద పక్షులను దగ్గరగా చూసేందుకు బైనోక్యూలర్ల సౌకర్యం కూడా కల్పించారు. విదేశీ వలస విహంగాలతో పాటు పర్యావరణ కేంద్రంలో విహంగాల చిత్రాల ప్రదర్శన, పార్కులోని జింకలు, చిలుకలు సందర్శకులందరినీ ఆకట్టుకున్నాయి.



బైనాకులర్‌తో విహంగాలను చూస్తున్న విద్యార్థులు



కేంద్రంలో ఉన్న గూడబాతులు



చెరువు నీటిలో ఈదుతున్న గూడబాతులు



పక్షులను వీక్షించేందుకు వస్తున్న పర్యాటకులు

మున్సిపాలిటీ అభివృద్ధికి బాటలు



చైర్ పర్సన్ దీపికను సన్మానిస్తున్న ఏఎంసీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, నాయకులు

నాయుడుపేటటౌన్: ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రత్యేక చొరవతో మున్సిపాలిటీలో రూ.కోట్ల నిధులతో అభివృద్ధికి బాటలు వేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక అన్నారు. చైర్ పర్సన్‌గా బాధ్యతలను చేపట్టి రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా చైర్‌పర్సన్‌ను ఆదివారం పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. పిచ్చిరెడ్డి తోపువీధిలోని మున్సిపల్ చైర్‌పర్సన్ నివాసం వద్ద ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే సూచనలకు అనుగుణంగా పాకవర్గ సభ్యులంత కలసికట్టుగా ఉండి 25 వార్డుల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. నాయుడుపేటను మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు రూ.కోట్ల నిధులు మంజూరు చేయించిన ఘనత కూడా ఎమ్మెల్యే కిలివేటికే దక్కుతుందన్నారు. మున్సిపాలిటీ ఎస్సీ జనరల్ స్థానం అయినప్పటికీ మహిళ అయిన తనకు కేటాయించిన ఎమ్మెల్యేకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బైనా మల్లికార్జున రెడ్డి, కటకం జయరామయ్య, పేట చంద్రారెడ్డి, ఎన్‌సీఆర్, అన్నమేటి చంద్రారెడ్డి, పేర్నాటి రాహుల్, ఆర్కాట్ శాంతకుమార్, షేక్ రహమాతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో కొండవల్లిపాడు



చుట్టుగుంట గిరిజన కాలనీలో నిర్మించిన సిమెంట్‌రోడ్డు

ఓజిలి: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కొండవల్లిపాడు పంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. కొండవల్లిపాడు పంచాయతీ పరిధిలో రుద్రాయపాళెం, కొండవపాడు, పార్లపల్లె, చుట్టుగుంట గ్రామాలున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ నాలుగు గ్రామాల్లో రూ.45 లక్షలతో సీసీరోడ్లు, రూ.48 లక్షలతో డ్రైనేజీ కాలువలు నిర్మించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో రూ.18 లక్షలతో జలజీవన్‌మిషన్ పథకంలో ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేసి తాగునీటి వసతి కల్పించారు. పంచాయతీ పరిధిలోని చెరువుల కట్టలను రూ.8 లక్షలతో మరమ్మతు చేశారు. రూ.10 లక్షలతో చెరువుకట్టపై రోడ్డును ఏర్పాటు చేసి, రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. జాతీయ రహదారి నుంచి చుట్టుగుంట మీదుగా రుద్రాపాళెం క్రాస్‌రోడ్డు వద్దకు రూ.5 లక్షలతో రోడ్డును నిర్మించారు. పనులన్నీ పూర్తి కావడంతో పంచాయితీ నూతనశోభ సంతరించుకుంది.

అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం



ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సహకారంతో పంచాయతీలో అభివృద్ధి జరిగింది. ఈ మూడు సంవత్సరాలలో రూ.1.44 కోట్లతో అభివృద్ధి పనులు చేశాం. రైతులకు రోడ్లు, చెరువు కట్టలు మరమ్మతులు చేపట్టాం. పంచాయతీలోని నాలుగు గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం.

-కొండూరు ప్రభాకర్‌రాజు, సర్పంచ్, కొండవల్లిపాడు

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

పెళ్లకూరు: మండలంలోని పునబాక, చావలి, శిరసనంబేడు గ్రామాల్లో ఈనెల 27, 28, 29 తేదీల్లో ఆయా గ్రామ సచివాలయాల్లో అందించనున్న ఆధార్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సురేష్‌బాబు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 0–5 ఏళ్ల చిన్నారులకు ఆధార్ నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే ఆధార్‌కు మొబైల్, మెయిల్ ఐడీ లింక్ చేయడం, బయోమెట్రిక్, పేరు, అడ్రస్, పుట్టిన తేదీ తదితర సవరణలు చేసుకునే అవకాశం కూడా ఉందన్నారు. కొత్తగా ఆధార్ నమోదుతోపాటు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



పక్షుల కేంద్రంలో ఏర్పాటు చేసిన బోర్డు

దొరవారిసత్రం: అసాంఘిక, అనైతిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు ఆదివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పక్షుల కేంద్రంలోకి జంటలుగా విచ్చేసి అనైతిక చర్యలకు పాల్పడుతున్నట్లు ఫారెస్టు రేంజర్ వరప్రసాద్ తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో విహంగాలు వీక్షించేందుకు విచ్చేసే సందర్శకులు, పర్యాటకులు ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. సెలవు దినాల్లో ఎక్కువ సంఖ్యలో బయట ప్రాంతాలకు చెందిన పలువురు జంటలుగా విచ్చేసి అనైతిక కార్యక్రమాలు, మద్యం సేవించడం తదితర కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలా చేస్తూ తమ శాఖా సిబ్బందికి పట్టుబడితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎఫ్ఆర్ఓ హెచ్చరించారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

వెంకటగిరి: మున్సిపాలిటీ పరిధిలో పన్నుల పాత బకాయిలు ఈ నెలాఖరులోగా పూర్తిగా చెల్లించేవారి కి అపరాధ రుసుం ఉంటుందని, ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీకి పన్నులు సక్రమంగా చెల్లించి, పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- అందుబాటులో ఉంటా
- ప్రజలకు అండగా నిలుస్తా
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



రామ్‌కుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

రాపూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధితోపాటు రాపూరు మండల అభివృద్ధి సాధించి తీరుతానని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. తొలుత మద్దెలమడుగు వద్ద ఉన్న శ్రీకృష్ణమందిరంలో పూజలు చేసి, పెట్రోల్ బంకు నుంచి ర్యాలీగా సభాస్థలానికి చేరుకున్నారు. మార్గంలో మహిళలు, వైఎస్సార్ సీపీ నాయకులు బాణ సంచా కాల్చి, మంగళ వ్యాద్యాల నడుమ పూలు చల్లుతూ హారతులు పట్టారు. జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఏమి అవసరమో? తెలుసుకున్నామని, అన్ని సమస్యలను ఒక్కొక్కటిగా సీఎం సహకారంతో పరిష్కరిస్తానన్నారు. మద్దెలమడుగులో ఉన్న డిగ్రీ కళాశాలను రాపూరులో ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. నియోజవర్గానికి పట్టిన శని గ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల క్రితం తొలగించారన్నారు. ఇతరుల ఆస్తులపై నింద వేసేటప్పుడు ఎదువారి పరిస్థితిని తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. ఎటువంటి వ్యాపారాలు చేయని అనం రామనారాయణరెడ్డి ఆస్తులు ఎలా పెంచుకున్నారని ప్రశ్నించారు. ఆత్మప్రభోదంతో ఓటు వేసి ఉంటే తెలుగుదేశం గెలిచేదా? అని ప్రశ్నించారు.

జగనన్న మనసున్న వ్యక్తి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనస్సున వ్యక్తి అని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. తనను నమ్మివారని అక్కున చేరుకునే మనస్సు వారు జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. తనకు జిల్లా అధ్యక్షుడిగా, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్తగా, పదవులు ఇచ్చారని, ఆయనకు జీవితాంత రుణపడి ఉంటానన్నారు. అలాగే నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి, యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మయ్యశెట్టి తనకు గురువులన్నారు. తన రాజకీయ ఎదుగుదలకు వారు ముగ్గురు చూపిన మార్గాలను తాను మరచిపోకుండా పాటిస్తానన్నారు. జిల్లాలో అనేక మందికి రాజకీయ భవిష్యత్ ఇచ్చిన కుటుంబం నేదురుమల్లి కుటుంబమని తెలిపారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో కలసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రతి 15 రోజులకొకసారి ఆయనతో కలసి వచ్చి, ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, పాపకన్ను దయాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ లక్ష్మీనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గంగిశెట్టి వెంకటేశ్వర్లు, శౌధర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బుజ్జిరెడ్డి, గౌరి, సర్పంచ్ జయమ్మ, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ కలపాటి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్ తదితరులు

కోట: విద్యార్థులు చదువుతో పాటు అన్నీ రంగాల్లో రాణించాలని కోట జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ సూచించారు. కోటలోని శ్రీప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం బాలోత్సవ్ ముగింపు సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానం కార్యక్రమానికి జడ్జి భరత్‌కమల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బాలోత్సవ్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం చిత్రలేఖనం, స్టోరీ టెల్లింగ్, స్పెల్‌బీ, వక్తృత్వ పోటీలు, క్విజ్, క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పుల్లారావు, పాఠశాల కరస్పాండెంట్ కిషోర్‌బాబు, టీఎమ్మార్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



ప్లాస్టిక్ డబ్బాలను పంపిణీ చేస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు, రఫీ

నాయుడుపేటటౌన్: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కమిషనర్ ఐ శ్రీనివాసరావు అన్నారు. ప్లాస్టిక్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం చికెన్ దుకాణాల వద్ద ప్లాస్టిక్ కవర్లు వినియోగించకుండా చికెన్ కోసం వచ్చిన ప్రతి ఒక్కరికీ అనువుగా ప్లాస్టిక్ డబ్బాలను కమిషనర్ చేతుల మీదుగా 786 సేవా సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని దుకాణ యజమానులు ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నివారించేందుకు తోడ్పాటు అందించాలన్నారు. వైస్‌చైర్మన్ రఫీ మాట్లాడుతూ సుమారు 2 వేల మందికిపైగా ఉచితంగా ప్లాస్టిక్ డబ్బాలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

మానసదేవి ఆలయాభివృద్ధికి తోడ్పాటు



భూమిపూజ చేస్తున్న రమణారెడ్డి తదితరులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని అగ్రహారపేటలో ఉన్న మానసదేవి(నాగమానసలమ్మ) ఆలయాభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందిస్తామని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి అన్నారు. మానసదేవి ఆలయం ఆవరణలో భక్తుల సౌకార్యర్థం రేకులు షెడ్డు నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి పలువురు దాతలు చేయూత అందించారన్నారు. తన సొంత నిధులతో రేకులషెడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ధర్మకర్త చలంబేటి వాసు, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా కన్ను.. పల్లెకు ఆరోగ్య రక్ష

- టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం
- పంచాయతీ స్థాయిలోనే కమిటీలు

పీహెచ్‌సీల్లో కనిపించని వైద్యులు.. అరకొర మందులు.. అత్యవసరమైనా పట్టణాలకు పరుగులు ఇదీ నాటి పరిస్థితి. నేటి ప్రభుత్వ హయంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో ఆ పరిస్థితి మారింది. నేడు సర్కారు మరో ముందడుగు వేసి వైద్యసేవల పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటుతో పల్లె ప్రజలకు ఆరోగ్య రక్ష చేకూరనుంది.



విలేజీ హెల్త్ క్లినిక్

సైదాపురం: గ్రామీణుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. మారుమూల ప్రాంతాల ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పంచాయతీల స్థాయిలోనే టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం గత నెల 28న ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆరోగ్య రంగంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనకు డాక్టర్ వైఎస్సార్ విలేజీ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణులకు విస్తృత సేవలు అందించేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీలకు రూపకల్పన చేశారు.

ఆరుగురు సభ్యులతో కమిటీ

ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఆరుగురు సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ ఎంఎల్‌హెచ్ఓ) ప్రతి గ్రామంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ లీడర్‌గా వ్యవహరిస్తారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్, స్కూల్ హెల్త్ అంబాసిడర్, గ్రామాల్లోని డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఈ కమిటీ సభ్యులుగా ఉంటారు.

కమిటీల విధులివీ..

గ్రామీణుల ఆరోగ్యంపై టాస్క్‌ఫోర్స్ కమిటీ నిరంతరం పర్యవేక్షించాలి. ప్రధానంగా గర్భిణులు, శిశువులు, మహిళలు, వృద్ధులు, పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం ఉన్నవారిని గుర్తించాలి. గ్రామీణ ప్రజలకు సోకే వ్యాధుల నివారణ, చికిత్సలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలి. విద్యార్థులు ఆరోగ్య వివరాలను స్కూళ్లలోని హెల్త్ అంబాసిడర్ పర్యవేక్షించాలి. కౌమార దశలోని బాలికలకు రోజూ ఐఎఫ్ఏ మాత్రలు పంపిణీ చేయాలి. బరువు తక్కువగా పిల్లలకు పోషకాహారం అందించాలి. యుక్త వయస్సు బాలికలకు శానిటరీ ప్యాడ్ల సరఫరా వివరాలు, బరువు తక్కువగా ఉన్న పిల్లల మధ్యాహ్న భోజనం వివరాలను కమిటీ లీడర్లుకు అందించాలి. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు పిల్లల్లో రక్తహీనతపై పర్యవేక్షించాలి.

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



గ్రామాల్లో ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఆరుగురు కమిటీ సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేస్తాం. సంపూర్ణ ఆరోగ్యం దిశగా పల్లెలను తీర్చిదిద్దుతాం ఈ కమిటీల ఏర్పాటు ద్వారా గ్రామీణుల అనారోగ్య సమస్యలను పరిష్కరించవచ్చు. పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూసేందుకు చర్యలు చేపట్టాం.

-వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ, సైదాపురం

ప్రజలకు ఎంతో ఉపయోగం



విలేజీ విలేజీ హెల్త్ క్లినిక్‌ల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఉంతగానో ఉపయోగపడుతాయి. ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమం ద్వారా హార్ట్‌టాక్, క్యాన్సర్, హైపర్ టెన్షన్ తదితర సమస్యలపై అవగాహన కల్పిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విలేజీ హెల్త్ క్లినిక్‌లు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు తదితర సేవలు అందిస్తున్నాం.

-జనార్దన్‌రావు, మండల వైద్యాధికారి, సైదాపురం

ఫీల్డ్ అసిస్టెంట్‌పై హత్యాయత్నం



గాయపడిన పాల్గుణ

ఓజిలి: మండలంలోని భట్లకనుపూరులో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బెల్లంకొండ పాల్గుణపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆదివారం హత్యాయత్నం చేశారు. బాధితుడి కథనం మేరకు.. భట్లకనుపూరు గ్రామానికి చెందిన ఫాల్గుణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉపాధిహామీ కూలీలు చేసిన పనులకు సంబంధించి వారి వద్ద సంతకాలు తీసుకుని ఇంటికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. గ్రామంలోని వినాయకుడి గుడి వద్ద గ్రామానికి చెందిన సురేంద్ర, వెంకటేశ్వర్లు, గురునాథం అతడి వాహనాన్ని ఆపి ఫాల్గుణపై గొడ్డలితో దాడి చేశారు. దీంతో పాల్గుణ అక్కడికక్కడే స్పృహతప్పి రక్తపుమడుగులో పడిపోయాడు. బంధువులు గమనించి 108కు సమాచారం అందించగా వారు వచ్చి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడిని నెల్లూరుకు తరలించారు. దాడి విషయం తెలుసుకున్న ఎస్ఐ దారం ఆదిలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సంఘటనకు సంబంధించి పాల్గుణ బంధువులు నుంచి స్టేట్‌మెంట్ నమోదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో అతడిపై జరిగిన్నట్లు గ్రామస్తులు తెలిపారని చెప్పారు.